చెత్త ఇలా ఉంటే రోగాలు రావా?

● హయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే



హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్‌కాలనీ లిటిల్ ఏంజిల్ పాఠశాల సమీపంలో

హయత్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో ఏ రోడ్డు పక్కన చూసినా చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. కనీసం వారానికి ఒక్క రోజు కూడా చెత్త తీయకపోవడంతో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలు, మాంసం వ్యర్థాలు ఇలా రక రకాల పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో నింపి ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. ప్రధానంగా రోడ్ల పక్కన వేస్తున్నారు. దీంతో వీధి కుక్కలు కవర్లను తీసుకువచ్చి రోడ్లపైన వేసి వ్యర్థాలను తినడంతో రోడ్లన్నీ కంపుకొడుతున్నాయి. వ్యర్థ పదార్థాలతో రోడ్లు నిండిపోతున్నాయి. హయత్‌నగర్‌లో జాతీయ రహదారి పక్కన అరుణోదయకాలనీ రోడ్డులో ఖాళీ ప్లాటులో విపరీతంగా చెత్త పేరుకుపోయింది. పరిసరాలు కలుషితంగా మారాయి. ముదిరాజ్‌కాలనీ రోడ్డులో రెండు చోట్ల ప్లాస్టిక్ కవర్ల కుప్పలు, వ్యర్థాలు నిండిపోయాయి. వస్పరినగర్‌కాలనీలో అదే పరిస్థితి. హయత్‌నగర్ పద్మావతికాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట చెత్త పేరుకుపోయింది. పాత నేషనల్ హైవే జీ స్కూల్ గోడ వద్ద చెత్త కుప్పలు నిండిపోయాయి. ఇలా ఒక్క చోట కాకుండా అనేక ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారని డివిజన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో చెత్త కుళ్లిపోయి దుర్గంధవాసన వస్తుంది.



ఆర్టీసీ-2 బస్సు డిపో వెనుక ప్రహరీని ఆనుకుని వస్పరినగర్‌కాలనీలో



రామకృష్ణానగర్‌కాలనీ శివారులో 255 సర్వే నంబర్ వద్ద పేరుకుపోయిన చెత్త

జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు

ఒక పక్క ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల మరిన్ని అంటురోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లో ఇప్పటికే ఇంటికి ఒక రోగి ఉన్నారు. హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి, బస్తీ దవాఖానాలు రోగులతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులు, డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్ స్పందించి చెత్తకుప్పలు తొలగించాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.



హెచ్ఎం ఉద్యోగ విరమణ సన్మానసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంకు విరమణ వీడ్కోలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాంచంద్రారెడ్డి ఉద్యోగ విరమణ సన్మానసభ శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎంని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువులదే కీలకపాత్ర అన్నారు. పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలకు రాంచంద్రారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెడ్మాస్టర్ అర్జున్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎంకు..

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ కోరని అర్జున్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో శుక్రవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావిభారత పౌరులను తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని అన్నారు. ఉద్యోగ విరమణ వయస్సుకే గానీ పనులకు కాదని, ఓపిక ఉన్నంత వరకు ఏదో విధంగా విద్యావికాసం కోసం పనిచేయవచ్చునని వారు పేర్కొన్నారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లోని న్యూమధురాపురికాలనీలో కొత్తగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహంతో పాటు నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లవారు జాము నుంచి ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, ముత్యాల లలితాకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రవీందర్‌దత్ శంషాబాద్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్‌రెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల రక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎల్బీనగర్ ఎస్‌హెచ్ఓగా వినోద్‌కుమార్..



కొత్తపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా కే.వినోద్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన వినోద్‌కుమార్ సైదాబాద్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేశారు. 2017లో ఆయన సీఐగా పదోన్నతి పొందారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐగా పనిచేశారు. ఇటీవలి ఎన్నికల వేళ ఆయన హైదరాబాద్ కమాండ్ కంట్రోల్‌లో పని చేశారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల సంరక్షణకూ చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి తదితర నిషేధిత మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, సేవనం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే వారు విధిగా పోలీసుల అనుమతి పొందాలన్నారు.

యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మారుతీనగర్ కాలనీలో శుక్రవారం యూజీడీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు అన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ మీనాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, కాలనీ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, బలరాంరెడ్డి, ఆనంద్‌కుమార్, రాజు, రవీందర్, నర్సింహారావు పాల్గొన్నారు.

పర్యావరణానికి అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి

● వై ఫ్లో సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టెయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండటమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టెయినబల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్‌షా, కాన్షియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరాంగ్‌షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో చైర్‌పర్సన్ రిద్ధి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకశాతం వస్త్రాలు మాత్రమే రీ సైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ : బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతోపాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.

చాట్‌లో బొద్దింక కలకలం



చాట్‌లో చనిపోయిన బొద్దింక

వనస్థలిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిను బండారంలో బొద్దింక కనిపించిన ఘటన వనస్థలిపురంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వనస్థలిపురానికి చెందిన రవి తమ ప్రాంతంలోని పనామా చౌరస్తాలో ఉన్న స్వీట్ షాపులో చాట్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకెళ్లి పిల్లలు తినేందుకు చాట్ ప్యాకెట్ ఓపెన్ చేయగా అందులో చనిపోయిన బొద్దింక కనిపించింది. రవి దానిని తీసుకెళ్లి కొనుగోలు చేసిన షాపు యజమానికి చూపించాడు. అయితే యజమాని మాత్రం చాట్‌లో పడిన బొద్దింకతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఇలాంటివి తరచూ జరుగుతూనే ఉంటాయని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బాధితుడు మీడియాకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న మీడియా ప్రతినిధులు బొద్దింక విషయంపై వివరణ అడిగారు. ఆగ్రహంతో ఊగిపోయిన షాపు యజమాని మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించాడు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ఈ షాపును సీజ్ చేయాలని బాధితుడు రవితో పాటు అక్కడున్న వినియోగదారులు అధికారులను కోరారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● అధికారులకు మేయర్ పారిజాతారెడ్డి సూచన



నాదర్‌గుల్ సున్నంచెరువును పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ రఘు, పోలీసు అధికారులు, కార్పొరేటర్లు

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మునిసిపల్, పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె నాదర్‌గుల్‌లోని సున్నంచెరువు, అల్మాస్‌గూడ చెరువులను సందర్శించి ఆయా చెరువుల వద్ద చేపట్టాల్సిన నిమజ్జన ఏర్పాట్లపై వారితో చర్చించారు. ఈ ఏడాది వినాయక విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో ప్రతిష్ఠించే అవకాశమున్నందున ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని మేయర్ వారికి సూచించారు. మూడవ రోజు నుంచే నిమజ్జనాలు మొదలవనున్నందున ఆలోగా క్రేన్‌లు ఏర్పాటు చేసుకోవాలని, చెరువు కట్టల మీద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, భక్తుల సౌకర్యార్థం రక్షణ చర్యలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్ర జరిగే అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేశ్ నవరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని పారిజాతారెడ్డి సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కమిషనర్ జీ.రఘు, ఏఈఈ వినీల్‌గౌడ్, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వో కీసరి నాగరాజు, ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలాడేరాలో ఉపాధ్యాయురాలు హృదయ మేరీని ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానిస్తున్న సైదాబాద్, చార్మినార్ మండలం డిప్యూటీ డీఈవోలు రాధాకృష్ణ, నెహ్రూబాబు, డిప్యూటీ ఐవోఎస్ వరప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అంజనేశ్వర్, మందడి వెంకట్‌రెడ్డి తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

జిల్లా కోర్టుల్లో 'ఫోరెన్సిక్‌సైన్స్' అంశంపై సదస్సు



ఫోరెన్సిక్‌సైన్స్ అంశంపై సదస్సులో వివరిస్తున్న ల్యాబ్ డైరెక్టర్ మోహన్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రాంగణంలో ఫోరెన్సిక్ సైన్స్ అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ప్రోబ్ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ మోహన్ ఎర్రగొళ్ల న్యాయవివాదంలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. దొంగతనాలు, హత్యలు, వంటి నేరాలు జరిగినప్పుడు ఫోరెన్సిక్ ద్వారా నేరాలకు సంబంధించిన ఆధారాలను సేకరించడం ద్వారా నేరాలను నిర్ధారించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, మహిళా ప్రతినిధి మీనాక్షి, జ్యోతి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రాస్తారోకో



దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో బైఠాయించి రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. శుక్రవారం పీడీఎస్‌యూ నగర కార్యవర్గం ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను కొత్తగా కొలువుదీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా విద్యారంగ సమస్యలపై అనేక హామీలు కురిపించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యారంగంపై దృష్టి సారించడం లేదని వారు విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించి విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నేటికి వేల కోట్లలో పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాల్లో స్కాలర్‌షిప్ ఆధారిత విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. పేద విద్యార్థులు ఉండే సాంఘిక, సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించే వరకు పీడీఎస్‌యూ ఆందోళన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు గణేశ్, సైదులు, ధరణి, సుమన్, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

హయత్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెంగీ, వైరల్ ఫీవర్లు పెరుగుతుండడంతో వైద్యాధికారులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అందుతున్న సేవలపై తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం. వాణి ఆకస్మిక తనిఖీ చేట్టారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులలో కలియ తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్య పరీక్షలు, సేవలు సక్రమంగా అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. సరిపడ మందులు ఉన్నాయా లేవా అని ఫార్మసిస్టును అడిగారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా విస్తరిస్తున్న డెంగీని నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. డెంగీ లక్షణాలు ఉన్న ప్రతి రోగికి డెంగీ టెస్టు చేసి సరియైన మందులు అందించాలని కోరారు. ఆస్పత్రి చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును ఛాలెంజ్‌గా తీసుకోవాలి : ప్రతాప్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక ఛాలెంజ్‌గా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పార్టీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్ సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో సభ్యత్వ నమోదుకు సంబంధించిన సన్నాహక సమావేశం శుక్రవారం నాదర్‌గుల్‌లోని తోట యెట్టారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతాప్ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పార్టీకి 11కోట్ల సభ్యత్వంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీ పటిష్ఠంగా ఉన్నదని అన్నారు. బడంగ్‌పేట్‌లో ఇతర పార్టీలకు అందనంత స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించాలని ఆయన సూచించారు. సమావేశంలో పాల్గొన్న బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో గడచిన ఆరేళ్లలో బీజేపీ గణనీయంగా ఎదిగిందని, స్థానిక ఎన్నికల్లో సాధించిన విజయమే దీనికి నిదర్శనమని అన్నారు. ఇక్కడి పార్టీ శ్రేణులు సుశిక్షితులైన సైనికుల్లా పని చేస్తారనే నమ్మకం తనకు ఉన్నదని, వారి వల్లనే పార్టీ బలోపేతంగా మారిందనే విషయాన్ని పార్టీ ఎన్నటికీ మరువబోదని ఆయన అన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ నడికుడ యాదగిరి, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, పార్టీ నాయకులు తర్రె మల్లేశ్‌యాదవ్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, బంగారు ప్రభాకర్, రామిడి వీరకర్ణారెడ్డి, గౌర శ్రీనివాస్, జెనిగె ఐలయ్యయాదవ్, రామోజీ శ్రీశైలంచారి, గుండె నాగార్జున, లాలం సందీప్, మోతీలాల్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, జక్కిడి మధుసూదన్‌రెడ్డి, జంగారెడ్డి, రేసు నర్సింహారెడ్డి, లక్ష్మణ్, జోరల ప్రభాకర్, ఆర్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లెలగూడలో ప్రభుత్వ భూమి కబ్జాపై 'హైడ్రా'కు ఫిర్యాదు

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని సర్వే నంబర్.155లో గల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, దానిని అడ్డుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని జిల్లెలగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బండి నాగేశ్‌యాదవ్ హైడ్రా అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన హైడ్రా కమిషనర్‌కు దీనిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్ మాట్లాడుతూ ఆర్‌సీఐ రోడ్డును ఆనుకుని ఉన్న సదరు సర్వే నంబర్‌లోని 33గుంటల భూమికి అక్రమ పద్ధతిలో పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేయించి, వాటి ఆధారంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్కడి ఓ తాత్కాలిక నిర్మాణాన్ని కూల్చేశారని, కానీ దొడ్డి దారిలో పొందిన పట్టాదారు పాసు పుస్తకాలను మాత్రం రద్దు చేయలేదని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దానిని అడ్డుపెట్టుకుని మళ్లీ ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తున్నారని, ఈ దృష్ట్యా అక్రమంగా పొందిన పట్టాదారు పాసు పుస్తకాలను వెంటనే రద్దు చేసి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన కోరారు.

జల్సాల కోసం చోరీలు

● ముగ్గురి అరెస్ట్.. 9 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట: జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, పాతమల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య(30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్ఆర్‌నగర్, బాపూనగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకటకృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాత్, ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.

దొరికిన డబ్బును అప్పగించిన పోలీసు

హయత్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న పోలీస్ కానిస్టేబుల్‌కు దొరికిన రూ.60వేలను తిరిగి బాధితునికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కే లక్ష్మీనారాయణ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. గురువారం డ్యూటీ ముగించుకొని రాత్రి 9గంటల సమయంలో బైక్ పైన ఇంటికి వెళ్తుండగా ఆనంద్‌నగర్ కాలనీలో రూ.60వేలు కిందపడి కనిపించాయి. డబ్బులు స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్ వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సీఐ నాగరాజుగౌడ్‌కు అప్పగించాడు. హయత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ నూర్ తన డబ్బులు పోగొట్టుకున్నాడు. విచారణ జరిపిన సీఐ రూ.60వేలను తిరిగి బాధితుడికి అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్‌ను సీఐతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది అభినందించారు.

శ్రావణ శుక్రవారం కిటకిటలాడిన ఆలయాలు

ఎల్‌బీనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు బారులు తీరారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు మరుగంటి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారికి తామరపుష్పాలతో అర్చన చేశారు. సాయంత్రం అష్టలక్ష్మీవ్రతాలు నిర్వహించారు.

కొత్తపేట : కొత్తపేట ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయ ప్రాంగణంలోని విజయవినాయకస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, కాశీ విశాలాక్షి అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో విశేష పూజలు చేశారు. కాశీ విశాలాక్షి అమ్మవారికి పసుపు కుంకుమలతో చీర, కిరీటం అలంకరించారు.

చాదర్‌ఘాట్ : దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత, సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 306 మంది మహిళలతో సామూహికంగా గాజులపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

వినాయక మండపం ఏర్పాటు చేస్తే అట్రాసిటీ కేసుపెడతా

● నిర్వాహకులను బెదిరించిన ఓ ఇంటి యజమాని

● మీర్‌పేట్ పోలీసులకు రాష్ట్రీయ వానర సేన ఫిర్యాదు



పవన్‌జైన్‌పై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న శివారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ, ఆ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన ప్రధాన కార్యదర్శి మందడి శివారెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సదరు వ్యక్తిపై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. బడంగ్‌పేట్‌లోని శ్రీవిద్యా టౌన్‌షిప్ కాలనీలో స్థానికులు ఎప్పటిలాగే వినాయక మండపం ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. ఈ క్రమంలో స్థానికంగా నివసించే పవన్‌జైన్ అనే ఓ ఇంటి యజమాని.. ఉత్సవ నిర్వాహకుల్లో ఒకరికి ఫోన్ చేసి తన ఇంటి ఎదురుగా మండపం ఏర్పాటు చేసి న్యూసెన్స్ చేస్తే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించాడు. ఉత్సవ కమిటీలో ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉద్యోగం సైతం ఊడగొట్టిస్తానని ఆయన హెచ్చరించాడు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రీయ వానరసేన రంగంలోకి దిగింది. హిందూ పండుగలను స్వేచ్ఛగా జరుపుకోకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్ రామ్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన తరఫున వానరసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందడి శివారెడ్డి శుక్రవారం మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వో నాగరాజును కలిసి పవన్‌జైన్‌పై ఫిర్యాదు చేశారు. అట్రాసిటీ కేసు పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఆ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న పవన్‌జైన్‌లాంటి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాగా దీనిపై విచారణ జరిపి నిజానిజాలు తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.